# న్యూసెన్సు

## శ్రీ శ్రీవత్స

చీకటి పడింది. ఎండకాల మయినప్పటికిన్ని హఠాత్తుగా మబ్బులు కమ్ముకొన్నవి. క్షణంలో కుంభవర్షము కుమ్మరించింది. ట్రావెలర్సు బంగాళాలో దొరగారు మాత్రము యీ అకాలవర్షానికి చాలా తాపత్రయపడుతున్నాడు. ఒక్కక్షణము పైపు వర్షము వెలిసింది. గాఢాంధకారము అయింది. దొర కుర్చీని తెచ్చివేయడానికి అప్పడిని పిల్చినారు. అప్పడు గుడిసెలోనుంచి పరుగెత్తుకొని వచ్చినాడు.

అప్పడికి నలభయి సంవత్సరాలుంటవి. మాదిగ కులములో పుట్టాడు. మంచి బలిష్ఠమయిన దేహము. కులవృత్తిలో గిట్టుబాటు కాక ఎక్కడయినా ఉద్యోగము సంపాదించవలెననే ఉద్దేశ్యముతో యౌవనంలోనే బయలుదేరాడు. ఎట్లాగో ట్రావెలర్సు బంగళాలో నయిట్ వాచరుపని సంపాదించినాడు. ఇప్పటికి పది సంవత్సరాల నుంచి కనుబొమలు లాగా ఎదుగూ బొదుగూ లేకుండా అదే కొలువులో వున్నాడు. నమ్మకమయినవాడనే పేరుకూడా సంపాదించేవాడు. బంగాళాకు వచ్చే ఎవరి గుట్టూబయట పెట్టేవాడు కాడు. ఒకజోలికీ జొక్యానికీ పోయేవాడు కాడు. అందువల్లనే పది సంవత్సరాలనుంచి నయిట్‌వాచరు పని చేస్తూవున్న, పైన ఒక దమ్మిడి అయినా ఆర్జనచేయలేక పోయినాడు.

కాలము ఒక్కరీతిగా వెళ్లదు. ఆరుమాసాలనాడు అప్పడి పెళ్లాము నీళ్లాడింది. ఒక ఆడపిల్లను కన్నది. సరిగా పథ్యమూ పానమూ లేకపోయింది. చనిపోయింది. పిల్లమాత్రము జీవించింది. పిల్లను ఎక్కడ దిగబెట్టడానికి 'నా' అనేవాళ్లు లేరు అప్పడికి. మళ్లీ పెళ్లి చేసుకోడానికి ఎంతమాత్రమూ యిష్టములేదు.

పది సంవత్సరాల నయిటువాచరు ఉద్యోగమువల్ల స్త్రీ అంటే అమిత అసహ్యము కలిగింది. రాధారిబంగాళాకు కిందటి పది సంవత్సరాలలో ఎవరువచ్చి దిగినదీ ఏరాత్రి ఏస్త్రీ వచ్చినదీ అప్పడికి హృత్కవిలె అయిపోయింది. అంత కామాతురత కలిగితే తీర్చుకోవడమే వుత్తమము. కాని ఒకస్త్రీని పెండ్లిచేసుకోడ పెద్ద తెలివితక్కువ అని తోచింది. స్త్రీ అనేది కార్యనిర్వాహణకు పురుషులకు వుపయోగించే ఒక పరికరమనే భావము వాడి మనస్సులో నాటుకొని పోయింది. ఆ భావము అచంచల మయిపోయింది.

ఎవరయినా ఎప్పుడయినా "ఏమిరా - అప్పడూ పెళ్లి చేసుకో రాదుటరా" అంటే "బాబయ్యా ఎందుకండి పెండ్లి? పెళ్లి చేసుకొంటే ఒక్కతే అవుతుంది. లేకపోతే కోరుకున్న మనిషి కోరుకున్న రోజున దొరుకుతుంది" అనిశ్చలోక్తిగా అనేవాడు.

'అయితే రాత్రి బంగాళాకు ఎవరు వచ్చారురా' అని వెంటనే అడిగేవాళ్లు.

"చదువురాదు బాబు, లేకపోతే పద్దువ్రాసి వుంచేవాణ్ణి. జ్ఞాపకం పెట్టుకొనే తెలివితేటలు మాత్రం లేవు" అనేవాడు.

అప్పడికి భార్య పోయేసరికి పిల్లకు ఆరోమాసం. పాలు గుడిచే పిల్ల. ఆపిల్లను ఏమి చేయడం? పారవేస్తాడా - ఆవుపాలుకొని వాడే మూడు పూటలా పట్టేవాడు. వాడికిచ్చే ఆరు రూపాయల జీతములో మూడున్నర రూపాయల పాలు పిల్లే తాగేది. ఇక మిగతా రెండున్నర రూపాయలు ఒకపూట భోజనానికి బొటాబొటీగా వాడికి సరిపోయేది.


ఆవుపాలు పిల్లకు యిముడక పిల్ల చావకుండాను బ్రతకకుండాను వుంది. రెండోపూట తిండిలేక పోయేసరికి అప్పడూ అదేస్థితికి తయారయినాడు. ఎవరితో వాడి క్షోభ చెప్పుకొన్నా, ఆర్చేవారూ తీర్చేవారూ లేకపోయినారు. ఇక పిల్లకు పదో నెల యెప్పుడు వస్తుందా యింతే అన్నము ఏదో విధముగా పెట్టవచ్చు ననుకొని జపము చేయడము మొదలుపెట్టినాడు.

ఈ చిక్కుతో రోజురోజుకు వాడికి వేదాంతము ముదిరిపోవడము మొదలు పెట్టింది.

## ౨

దొర కేకవేసినాడని గుడిసెలోనుంచి బంగాళాకు వచ్చినాడు. కుర్చీ తెచ్చి బయట వేసినాడు. పడకకుర్చి ఒకటి తీసుకొనివచ్చి బయటవేయమని దొరగారు ఆజ్ఞాపించినాడు. రెండోకుర్చి తీసుకొని రావడానికి లోపలికి వెళ్లినాడు. గుడిసెలో వున్న పిల్లది కెవ్వున కేక వేసి ఏడ్వడము వినిపించింది. అంతే ఆ కుర్చీ అక్కడే పారవేసి గబగబ గుడిసెలోకి వెళ్లినాడు.

గుడిసెలోకి పిల్లి దూరింది. గూట్లోవున్న పాలను ఆప్యాయంగా తాగుతున్నది. అదలిస్తే గిన్నెను కింద పడ దోస్తుందేమో ననుకొంటూ ఏమి చేయడమా అని



అనుకొంటూ వుండగానే అప్పణ్ణి పిల్లిచూసి పారిపోబోయి గిన్నె తన్నింది. పాలన్నీ కిందవొలికి పోయినవి.

ఇక రాత్రికి పాలు లేవు. వెలిసిన వాన మళ్లీ మొదలు పెట్టింది. క్షణక్షణానికీ వాన జోరుఅవుతూ వుంది. అప్పుడు నిర్విణ్ణు డయిపోయినాడు. ఇక నారాత్రి ఆపిల్లదానితో గడపడ మెట్లాగో తెలియలేదు.

ఆ రాత్రివేళ - ఆ వర్షములో పిల్లదాన్ని ఒంటరిగా గుడిసెలో వదిలిపెట్టి పోవడ మెట్లా - పాలు తేవడ మెట్లా ?...సరే ధైర్యముచేసి పోవలెననుకొన్నా చేతులో గుడ్డిగవ్వ అయినా లేదు. తనకు వాడికగా పోసే పాలదాని దానిదగ్గర ఆ సమయంలో పాలు దొరుకుతవో లేదో ? బంగళాకు వచ్చిన దొర కాస్త సాయిలా పాయిలా మనిషిగా తోచినాడు. పోయి తనస్థితి చెప్పుకొని ఒక అణా డబ్బులు ధర్మ మివ్వమన్నాడు.

అప్పడిమాట పూర్తికాక పూర్వమే దొర పెద్దగొంతుతో 'గెటవుట్' అన్నాడు. చిన్నబోయినాడు... హృదయం బద్దలయి పోయింది. వచ్చివసారాలో 'యిక గతేమిటిరా భగవంతుడా' అంటూ నిలుచున్నాడు. లోపల మాటలధ్వనికి అప్రయత్నముగా లోపలికి చూసినాడు. గొప్పవారి ఇంటి పడుచే - అందులో చదువూ సంధ్యా వున్న యువతే వచ్చి దొరగారితో వీర విహారము చేస్తూ వుంది.

రాత్రి పదిగంటలు కావచ్చింది. ఒకచెంప కుంభముతో కుమ్మరిస్తున్నదా అన్నట్టుగా వర్షము. ఈ చెంప రాధారి బంగళాలో దొరగారి కాముకకేళీ - ఆ చెంప తన గుడిసెలో పాలులేక పిల్లదాని ఘోష - ఈ స్థితిలో స్తంభించిపోయినాడు. ఎంతసేపు శూన్య హృదయముతో నిలుచో గలడు. ఆమహాంధకారములో గుడిసెలోకి బయలుదేరినాడు.

వర్షపాతానికి అప్పటి కప్పుడే గుడిసెకప్పులో చాలా భాగములలో తూట్లు పడిపోయి గుడిసెఅంతా జలప్రవాహము అయిపోయింది. ఇంకా కాస్సేపు వాడు రాకుండా వుంటే ఆ ప్రవాహములో పసిపిల్లదాని అంతట అదే బయటికి వచ్చేది. చూసినాడు. పిల్లను చంక కెత్తుకొన్నాడు. బంగళా వసారాలోకి వచ్చినాడు వసారాలో నాలువైపులా వెతికితే ఒక చింపిచాప దొరికింది. పిల్లను చాప మీద పడవేసినాడు.

గుడ్డలన్నీ తడిసిపోయినవి. పిల్లకు కప్పడానికి ఒక్క పొడిగుడ్డయినా కనుపించలేదు. చలికి బాగా గాటు తేలి

అప్పడి దేహమే కొంగర్లు పోతున్నది. ఇక పిల్లదానిగతి చెప్పవలెనా?...పాలులేవు - ఆకలి - అందులో చలి - ఇక పిల్ల దేమిచేస్తుంది? ఒకటేఏడ్పు - వర్షముతో పోటీ చేయడము మొదలు పెట్టింది. ఆ పిల్లదాని రోదనానికి చెవులు బ్రద్దలయి పోతున్నవి. చెవులు బ్రద్దలయి పోవడ మేమిటి ఆ బంగాళా గోడలూ - కప్పూ కదిలి పోతున్నవి.

లోపల వెచ్చగా ఎంతో సుఖము - అందులో నవ యౌవనములో వున్న హిందూ యువతితో అనుభవిస్తున్న దొరగారికి పిల్లదాని ఏడ్పు అంతరాయ మయింది. పడు కొనే పక్కలోనుంచే - పెద్దగొంతుతో "పిల్లఏడ్పు మాన్పించు" అని పెద్దకేక వేసినాడు. పిల్లదాన్ని సముదా యించడము అప్పడితరమా! పైయి పెచ్చు పిల్లది శ్రుతిపెం చడము మొదలు పెట్టింది.

దొరగారు చటుక్కున లేచినారు. తలుపు ఠఖీమని తీసినారు. బయటకు రాగానే అప్పడితో "ఆ పిల్లను యిక్కడనుంచి తీసివేయ" మన్నారు. వాడు అత్యంత వినయముతో వాడిస్థితి అంతా గబగబా చెప్పివేసినాడు.

"అదంతా నాకు తెలియదు. ఈ దేశములో అన్నం లేనివాళ్లను యెంతమందినో యెరుగుదును. వాళ్లందరి భోజన సమస్య తీరితే నీ సమస్యకూడా తీరుస్తాను. ఆ సంగతి అట్లావుంచు. ముందు పిల్ల ఏడవకుండా వుండేట్లు చేయి." అన్నాడు దొర.

"అయ్యా దొరగారూ అది సాధ్యము అయ్యేట్లు తోచ డము లేదు."

దొరకు విపరీతమయిన ఆగ్రహము వచ్చింది "అట్లా అయితే ఈ పిల్లను విసురుబుచ్చుకొని అవతల పార వేస్తాను" అన్నాడు.

"నీతరము కాదు. నీ అబ్బ తరముకాదు."

దొర అప్పణ్ణి కొట్టబోయినాడు. పిల్లదాని రోదనము యింకా యెక్కువయింది. వీరాంగము వేసినట్టయింది. ఎదురు తిరిగినాడు అప్పడు. అప్పడి దెబ్బకు హతము అయిపొయ్యేట్టుగా తోచింది దొరకు. హుంకరించి పయికి వురికినవాడల్లా లోపలికి వురికి తలుపులు బిడాయించు కొన్నాడు.

అంతవరకూ నిద్రపోతున్న అప్పడి కోపము ప్రకోపిం చింది. "తియ్యి తలుపు. నిన్ను లంజముండతో ఈ బంగా ళాలో ఎవరు వుండమన్నారో విచారించాలి. తీయి తలుపు" అంటూ బద్దలయ్యేట్టు తన్నడము మొదలు పెట్టినాడు.

రసకందాయపు పట్టులో యీ గల్లంతు ప్రారంభ మయింది. లోపలవున్న యువతికి గుండెలలో గుండెలు లేవు. వణికిపోతున్నది. దొర అటు ఆమెను సముదా యించలేకనూ - ఇటు అప్పడు పిల్లను సముదాయించలే కనూ ఉగ్రమూర్తులయి పోయినారు.

ఎప్పుడు తెల్లవారుతుందో - అసలు తెల్లవారడమంటూ వుందో లేదో - తోచలేదు.

## 3

ఉదయము తొమ్మిది గంటలవుతుంది. రాత్రి ప్రాణము శోషించిపోయిన పిల్ల పొద్దున కాసిని పాలుతాగే సరికి సొమ్మసిల్లి నిద్రపోతున్నది.

పోలీసు జవాన్ వచ్చి అప్పణ్ణి స్టేషన్‌కు రమ్మన్నాడు. విషయ మేమిటో అర్థంకాలేదు. ఆ నిద్రపోతున్న పిల్లను బుజాన వేసుకొని రాజాజ్ఞ ధిక్కరించడానికి యిష్టములేని అప్పడు బయలుదేరినాడు.

అప్పణ్ణిచూస్తూనే సబ్‌యిన్‌స్పెక్టరు భగ్గున మండిపడి పోయి "ఏమిరా - రాత్రి తాగివచ్చి తెల్లవార్లూ తందనా లాడి దొరను నిద్రపోనీయ లేదట. నీమీద రిపోర్టు చేశాడు. బుద్ధివుందా లేదా...ఎవరిచేతనయినా జామీన్ యిప్పించి వెళ్లిపో. లేకపోతే జయిలులో పడవేస్తాను. ఖబడ్దార్" అన్నాడు.

"చిత్తం ప్రభువులు చిత్తగించాలి. నేను తాగనూ లేదూ - తందనాలం ఆడనూలేదు. అదంతా ఆదొరా - ఆ దొరకోసం వచ్చిన బ్రాహ్మణ పడుచూ చేసినారు బాబయ్యా" అన్నాడు.

బ్రాహ్మణపడుచూ - దొరా అనేసరికి ఇన్‌స్పెక్టరుకు కాస్త రెపరెపలాడింది. ఎవరు ఏమిటీ అనే విచారణ ప్రారంభించినాడు. దొరగారు తమకంపెని సామానులు అమ్మడానికి ఏజంటును పెట్టె నిమిత్తము వచ్చినారనీ ఫలాని పడుచు ఫలానివారికి సిఫారసుచేసి యిప్పించడానికి వచ్చిందనీ అప్పడు చెప్పినాడు. తర్వాత సొంతకథంతా చెప్పినాడు.

ఇన్‌స్పెక్టరు సహజౌదార్యము వల్ల కాకపోయినా ఒకపడుచు దానిసంగతి తెలుసుకొన్నందుకు సంతోషించి అప్పణ్ణి జామీన్ లేకుండానే పంపించివేసి త్వరలోనే కేసు సబ్ మేజస్ట్రీటు కోర్టులో దాఖల్ చేసినాడు. మెజస్ట్రీట్ మొదట కేసు బెంచికివేయదలచు కొన్నాడు. కాని అవతల ఫిర్యాది తెల్లతోలు అయ్యేసరికి కొంచెము గాభరాపడి తానే విచారించడానికి పూనుకొన్నాడు.

విచారణ ఆరంభమయినది. దొరగారి తరఫున సాక్ష్యముగా దొరగారికి దేహమర్పించడానికి వచ్చిన పడుచు వచ్చింది

ముద్దాయి ఏమి చెప్పుకొన్నా ప్రయోజనము లేకపోయింది. వెయ్యి రూపాయలు మాసానికి జీతము తీసుకొనే దొరగారు అబద్ధమాడుతారనడానికి మేజస్ట్రీటుకు దమ్ములు లేకపోయినవి. చివరకు ఎట్లా అయితే నేమి అప్పటికి రెండు నెలలు కఠినశిక్ష విధించాడు.



శిక్ష చెప్పగానే చంకలో వున్న పసికందును చూసి మందహాసము చేసినాడు. "లోకము పోకడ అంతా యింతే, ఇంత కాలము నుంచీ తెలియలేదు. ఆఫీసులచుట్టూ తిరిగినా ఫలితమేమిటి? అన్నట్లయితే యీ సాధారి బంగళాకు వచ్చే పొయ్యే ప్రతి ఆడదానిదగ్గిరా జమాబందిచేసి వుండేవాణ్ణి. అయిపోయిందానికి అనుకొని ప్రయోజనము లేదు. చిత్తంప్రభూ గోదావరి స్నానం యెప్పుడు చేయిస్తారు?" అన్నాడు అప్పడు.

"ఈ సాయంత్రమే పంపుతారు పో" అన్నాడు మేజస్ట్రీట్.

సాయంత్రం నాలుగంటల బండిలో అప్పణ్ణి రాజమంద్రము పంపడానికి యేర్పాటు అయింది. పోలీసులు వచ్చి లేవమన్నారు. పిల్లతో సహా లేచి 'తయార్' అన్నాడు.

ఇన్స్పెక్టరు "పిల్ల నెవరికయినా యిచ్చివేయి" అన్నాడు.

"నే నెవరికిచ్చేది బాబూ - నాకు దిక్కెవరూ, దేవుడికి యీయవలెను."

"పిల్లను జయిలులోకి రానీయరు."

"అయితే పిల్ల లేకుండా నే నెట్లా బయలుదేరుతాను?"

"పిల్లను అవతల పారవేయ వలసిందే!"

"వీలు లేదు."

"మరి అయితే"

"పిల్లనూ కూడా పంపించవలసి వుంటుంది. ఆవువెంట దూడ వెళ్లదు. ఈ పిల్లకు తండ్రీ తల్లీ అంతా నేనే. ఇక ఎవరికీ ఏవిధమయిన ప్రమేయమున్నూ లేదు.

"అయితే?"

"అయితే గియితే లేదు. పిల్లను వెంటతీసుకొని పోవలసిందే. పిల్ల లేకుండా తండ్రి ఎట్లా జయిలుకు పోతాడు.

"వీలులేదు"

"అయితే పిల్లను బజారులో పారవేయ మంటాడా మేజస్ట్రీట్? పోయి కనుక్కోండి?"

పోలీసువారి సందేహం మేజస్ట్రీటువారితో చెప్పినారు. వారికింకా సందేహం తీరినట్టు కనుపించదు.